క్లుప్తంగా

నేడు రెవెన్యూ సదస్సులు

వరికుంటపాడు: కొండాయపాళెం, ఇరువురు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను గురువారం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ హేమంత్‌కుమార్ బుధవారం తెలిపారు. భూ సమస్యలపై అర్జీలను స్వీకరించనున్నట్లు చెప్పారు.

పేదలకు దుప్పట్ల వితరణ



ఆత్మకూరు: క్రిస్మస్‌ను పురస్కరించుకుని పట్టణంలోని క్రిస్టియన్‌పేటకు చెందిన ఎడ్నమ్మ మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 500 మందికిపైగా పేదలకు బుధవారం దుప్పట్లను వితరణ చేశారు. ట్రస్ట్ నిర్వాహకులు పీ ఎడ్వర్డ్, సుధీర్‌బాబు, అనిల్‌కుమార్, సుజీవన్, పీ బన్ని, సుమియోను పాల్గొన్నారు.

వైద్యశిబిరం



వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం బత్తినవారిపల్లిలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలో విషజ్వరాల కేసులు ఎక్కువగా ఉండడంతో చాకలకొండ పీహెచ్‌సీ వైద్యారోగ్య సిబ్బంది జ్వరపీడితులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

శ్మశానానికి దారి సౌకర్యం కల్పించాలని నిరసన



సీతారామపురం : మండల కేంద్రమైన సీతారామపురంలో ముస్లిం శ్మశాన వాటికకు దారి సౌకర్యం కల్పించాలని కోరుతూ రంగు బావి సమీపంలోని గుంట మడుగు వాగులో దిగి ముస్లింలు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లిం శ్మశాన వాటికకు సరైన దారి సౌకర్యం లేక ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. వర్షాకాలంలో గుంటమడుగు వాగులో నీరు చేరితే మృతదేహాలను అరుంధతీయవాడ మీదుగా తీసుకెళ్లాల్సి రావడంతో అనే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా దారి సమస్యకు పరిష్కారం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



సీతారామపురం: క్రిస్మస్ సందేశాన్ని ఇస్తున్న దైవసందేశకులు



ఆత్మకూరులోని చర్చిలో ప్రార్థనలకు హాజరైన భక్తులు



క్రిస్మస్ సందేశాన్ని అందజేస్తున్న పాస్టర్ సుందరరావు

కావలి: పట్టణంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్రీస్తు జననాన్ని స్వాగతిస్తూ మంగళవారం రాత్రి 9 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు పట్టణంలోని చర్చిలు, ప్రార్థనా మందిరాల్లో క్రైస్తవులు క్రీస్తు గీతాలను ఆలపిస్తూ ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. బుధవారం ఉదయం పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఏసుక్రీస్తు జనన సందేశాన్ని అందజేశారు. అనంతరం పేదలకు అన్న, వస్త్రదానం చేశారు. కాగా క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని క్రైస్తవులకు మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఏసుక్రీస్తు బోధనలు సర్వమానవాళికి మార్గదర్శకమన్నారు. పట్టణంలోని చర్చిల్లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పాల్గొన్నారు. చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

బిట్రగుంట: బోగోలు మండలంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్రీస్తు రాకను స్వాగతిస్తూ మంగళవారం రాత్రి నుంచి అర్ధరాత్రి వరకు చర్చిలు, ప్రార్థనా మందిరాల్లో శాంతి గీతాల అలాపన, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడంతో సందడి నెలకొంది. బోగోలులోని ప్రసిద్ధి చెందిన తెలుగు బాప్టిస్ట్ చర్చి, ఆర్‌సీఎం, హోలీఫ్యామిలీ, తెలుగు బాప్టిస్ట్ చర్చి, కప్పరాళ్లతిప్పలోని బోడెన్‌పేట చర్చిలో వేకువ నుంచి నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలకు క్రైస్తవ సోదరులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రార్థనా మందిరాల్లో పేదలకు అన్న, వస్త్రదానం చేశారు. క్రీస్తు జననాన్ని ప్రతిబింబించేలా చర్చిల్లో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువులు, చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి.

అల్లూరు: మండలంలోని క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. అల్లూరు దళితవాడలోని రక్షణ సైన్యం చర్చిలో చెన్నైకు చెందిన దైవసందేశకులు పాస్టర్ శామ్యేల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఏసుక్రీస్తు జనన సందేశం, బైబిల్‌లోని వ్యాఖ్యలను వినిపించారు. యేసుక్రీస్తు గొప్ప శాంతి దూత, ప్రేమకు ప్రతిక అని పేర్కొన్నారు. యేసుక్రీస్తు చూపిన శాంతి మార్గంలో ప్రతిఒక్కరూ పయనించాలన్నారు. పాస్టర్లు ప్రసాద్, మణి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని చర్చిలు, ప్రార్థనా మందిరాల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి నుంచే శాంతి ప్రార్థనలు నిర్వహించారు. క్రైస్తవ సోదరులు పెద్దఎత్తున చేరుకుని క్రీస్తు గీతాలను ఆలపించారు. బుధవారం ఉదయం పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రిస్మస్ సందేశాన్ని వినిపించారు. పట్టణంలోని తెలుగు బాప్టిస్ట్ చర్చిలో క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంచారు. పేదలకు వస్త్ర, అన్నదానాలు చేశారు.

చేజర్ల: మండలంలోని క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. మాముడూరు, గొల్లపల్లి, చేజర్ల ఎస్టీ కాలనీ, ఆదూరుపల్లి, ఓబులాయపల్లి, టీకేపాడు, తదితర గ్రామాల్లోని చర్చిలు, ప్రార్థనా మందిరాల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రిస్మస్ సందేశాన్ని అందజేశారు. అనంతరం కేక్‌లు కట్ చేసి పంచారు. పేదలకు అన్నదానం చేశారు.

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట, గుడిపాడు, కావలియడవల్లి, రాజవోలు గ్రామాల్లోని ప్రధాన చర్చిల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాజవోలు చర్చిలో పాస్టర్ సుధీర్ క్రిస్మస్ సందేశాన్ని అందజేశారు. ఎడ్నెమ్మ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఆటల పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతులను అందజేశారు.

సంగం: మండలంలోని క్రైస్తవ ప్రార్థనా మందిరాల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. దువ్వూరులోని చర్చిలో క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచారు. క్రైస్తవ ప్రార్థనా మందిరాలు విద్యుద్దీప కాంతులతో కళకళలాడాయి.

మర్రిపాడు: మండలంలోని చర్చిలు, ప్రార్థనా మందిరాల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మర్రిపాడులోని క్రైస్తవ ప్రార్థనా మందిరంలో జరిగిన వేడుకల్లో వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు పాల్గొన్నారు. తన మాతృమూర్తి మాజీ సర్పంచ్ రత్తమ్మతో కలిసి ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి చిన్నారులకు పంచిపెట్టి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.



సంగంలో సందడి చేసిన శాంతాక్లాజ్

సోమశిల: అనంతసాగరంలోని క్రైస్తవ ప్రార్థనా మందిరంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాస్టర్ సంపత్‌కుమార్ క్రిస్మస్ సందేశాన్ని అందజేశారు. అనంతరం చిన్నారులు, మహిళలకు వస్త్రాల పంపిణీ, అన్నదానం చేశారు.

ఉదయగిరి: ఉదయగిరి, వింజమూరు మండలాల్లోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయగిరిలోని బాప్టిస్ట్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచారు. గండిపాళెంలోని చర్చిలో జరిగిన వేడుకల్లో వైఎస్‌ఎంపీపీ జీ మాలకొండయ్య, మాజీ ఎంపీటీసీ పాముల రమణయ్య పాల్గొన్నారు. క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపి స్వీట్లు పంపిణీ చేశారు. వింజమూరులో ఫిలడెల్ఫియా, సియోన్ ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వింజమూరు సొసైటీ మాజీ అధ్యక్షుడు జూపల్లి రాజారావు పాల్గొని స్వీట్లు పంపిణీ చేశారు.

వరికుంటపాడు: మండలంలోని క్రైస్తవ పార్థనా మందిరాల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్రీస్తు జననాన్ని స్వాగతిస్తూ మంగళవారం రాత్రి నుంచి అర్ధరాత్రి వరకు శాంతి ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం క్రిస్మస్ కేక్‌లు కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. బుధవారం ఉదయం పాస్టర్లు క్రిస్మస్ సందేశాలను అందజేశారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు.

దుత్తలూరు: మండలంలోని రాచవారిపల్లి, ఏరుకొల్లు, భైరవరం, నందిపాడు, నర్రవాడ, తెడ్డుపాడు, కొత్తపేట, తిమ్మాపురం, దుత్తలూరు సెంటర్, పూసలకాలనీ, తదితర ప్రాంతాల్లోని క్రైస్తవ ప్రార్థనా మందిరాల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాస్టర్లు యేసుక్రీస్తు జననం, బోధనల గురించి వివరించారు. అనంతరం కేక్‌లు కట్ చేసి పంచిపెట్టారు.

జలదంకి: మండలంలోని క్రైస్తవ ప్రార్థనా మందిరాల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యుద్దీపాలతో ప్రార్థనా మందిరాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఏసుక్రీస్తు జననాన్ని స్వాగతిస్తూ మంగళవారం రాత్రి నుంచి అర్ధరాత్రి వరకు పాస్టర్ల ఆధ్వర్యంలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉదయం పాస్టర్లు ఏసుక్రీస్తు జన్మసందేశాన్ని వినిపించారు. టీడీపీ తెలుగు యువత మండలాధ్యక్షుడు మునగాల తిరుమల రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని ప్రార్థనా మందిరాల్లో స్వీట్లు పంచిపెట్టారు.

కలిగిరి: మండలంలోని క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. క్రైస్తవ ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. పాస్టర్లు క్రీస్తు జనన సందేశాన్ని, బైబిల్‌లోని వ్యాక్యలను వినిపించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

కొండాపురం: మండలంలోని కొండాపురం, కొమ్మి, సాయిపేట, ఎర్రబల్లి, గరిమెనపెంట, తదితర గ్రామాల్లో క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. చర్చిలు, ప్రార్థనా మందిరాల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కేక్‌లు కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు.

సీతారామపురం : మండలంలోని సీతారాంపురం, సింగారెడ్డిపల్లి, మారంరెడ్డిపల్లి, అయ్యవారిపల్లి, చిన్నాగంపల్లి, గుండుపల్లి, సోంపల్లి, బసినేనిపల్లి రంగనాయుడుపల్లి, పోకలవారి పల్లి, సంజీవరెడ్డినగర్ తదితర గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్లు యేసుక్రీస్తు జనన సందేశాన్ని వినిపించారు. ఏసుప్రభువు చూపించిన సన్మార్గంలో ప్రతిఒక్కరూ నడవాలని ఆకాంక్షించారు.



అల్లూరు దళితవాడలోని రక్షణ సైన్యం చర్చిలో..



కావలి: క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి



కలిగిరిలో..



మర్రిపాడులో..



జలదంకిలో..



సోమశిల: అనంతసాగరం చర్చిలో దుస్తుల పంపిణీ



అనుమసముద్రంపేట: బహుమతుల ప్రదానం



దుత్తలూరు: రాచవారిపల్లి చర్చిలో..



ఉదయగిరిలోని బాపిస్ట్ చర్చిలో..



వింజమూరులో స్వీట్లు పంపిణీ



సంగం: దువ్వూరులో..



చేజర్ల: గొల్లపల్లి చర్చిలో..

మమ్మేలు తల్లి..కరుణించరావమ్మా



అల్లూరులోని పోలేరమ్మ ఆలయం

- కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి అల్లూరు పోలేరమ్మ
- ఈ నెల 31న గ్రామోత్సవం
- భారీగా ఏర్పాట్లు చేస్తున్న ఉత్సవ కమిటీ
- తరలిరానున్న దేశ,విదేశాల్లో స్థిరపడిన అల్లూరీయులు



పోలేరమ్మకు సద్ది సమర్పించేందుకు ఊరేగింపుగా వస్తున్న మహిళలు (ఫైల్)

కావలి: జిల్లాలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరిగే పోలేరమ్మ ఉత్సవాల్లో అల్లూరుకు విశిష్ట స్థానం ఉంది. పాడిపంటలకు ప్రసిద్ధి చెందిన అల్లూరులో దశాబ్దాలుగా జరిగే పోలేరమ్మ గ్రామోత్సవం ఎంతో ప్రాచుర్యం పొందింది. గ్రామనడిబొడ్డున స్వయంభువుగా కొలువైన భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పోలేరమ్మ గ్రామోత్సవాన్ని ఏటా సంక్రాంతికి ముందు నిర్వహించడం సంప్రదాయం. ఈ ఏడాది ఈ నెల 31న అమ్మవారి గ్రామోత్సవాన్ని నిర్వహించాలని ఉత్సవ కమిటీ సభ్యులు నిర్ణయించారు. దేశవిదేశాల్లో స్థిరపడిన అల్లూరీయులే కాకుండా జిల్లా నలుమూలల నుంచి భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉండడంతో అందుకనుగుణంగా ఏర్పాట్లు చేపడుతున్నారు. మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ సభ్యులు జాతర ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ఇదీ అమ్మవారి ఇతి వృత్తాంతం

భారతదేశ సంస్కృతిలో గ్రామదేవతలకు విశిష్ట స్థానం ఉంది. అతివృష్టి వచ్చినా, అనావృష్టి వేధించినా, అంటు వ్యాధులు ప్రబలినా, అంతుచిక్కని సమస్యలు ఎదురైనా ముందుగా గ్రామదేవతలనే శరణు కోరేవారు. అమ్మవార్ల కరుణ, కటాక్షాలతోనే పల్లెలు ప్రశాంతంగా ఉంటాయనే విశ్వాసంతో పూర్వీకుల నుంచి ఏటా గ్రామదేవతలకు ఘనంగా ఉత్సవాలు నిర్వహించేవారు. అదే కోవలో అల్లూరు గ్రామదేవత, స్వయంభువుగా వెలసిన పోలేరమ్మకు సుమారు 700 ఏళ్ల నుంచి క్రమం తప్పకుండా ఏటా సంక్రాంతికి ముందు గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు.

తైదుల బుట్టలో ఆవిర్భావం

సుమారు 700 ఏళ్లకు పూర్వం వడ్లమోపూరు(ఇప్పటి నార్త్‌మోపూరు)లోని మేదా వంశీయుల ఇంట్లో పోలేరమ్మ ఉద్భవించినట్లు పూర్వీకుల కథనం. మేదా వంశీయుల ఇంట్లోని తైదుల బుట్ట ఉబ్బి ధాన్యం కింద పడిపోతుండగా పరిశీలించగా ఓ రాతి శిల కనిపించింది. అదే రోజు రాత్రి ఇంటి యజమాని కలలో అమ్మవారు కనిపించి 'నేను అల్లూరు గ్రామదేవత పోలేరమ్మను.. నన్ను అక్కడే పెట్టి పూజించండని' చెప్పడంతో అల్లూరులోని తమకు చెందిన తోటలో శిలను ప్రతిష్ఠించినట్లుగా పూర్వీకులు చెబుతారు. ఆ తరువాత అల్లూరుకు అన్ని విధాలా కలిసిరావడంతో గ్రామస్తులు పోలేరమ్మను ఇలవేల్పుగా కొలుస్తూ సువిశాలమైన గుడి కట్టించి ఏటా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. పోలేరమ్మకు ఏటా నిర్వహించే ఉత్సవాలు సంస్కృతి సంప్రదాయల మేళవింపుగా, అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతో సాగుతాయి. తొలిచాటింపు, మలి చాటింపు తర్వాత వచ్చే మూడో మంగళవారం ఘనంగా గ్రామోత్సవం నిర్వహించడం తరతరాలుగా కొనసాగుతోంది. ఈ నెల 31న గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

గ్రామోత్సవం సాగేది ఇలా..

ఈ నెల 31న ఉదయం 5 గంటలకు పోలేరమ్మకు అభిషేకం, కుమ్మరివారి సంప్రదాయ అఖండ ప్రతిష్ఠ, 8 గంటలకు గంగమ్మకు వెండి చీర అలంకరణ, తూర్పువీధి మహాలక్ష్మమ్మ గుడి వద్ద నుంచి కాటంరెడ్డి శివప్రియ ఆధ్వర్యంలో 1,001 కుండలతో మహిళలు ఊరేగింపుగా సద్ది తీసుకొచ్చి నివేదన, మధ్యాహ్నం 12 గంటలకు పోలేరమ్మ గుడి వద్ద పొంగళ్లు, 1 గంటకు బైనాడి వారిచే కథా కాలక్షేమం, 3 గంటలకు చలిపిండి, పానకాలు, సాయంత్రం 4 గంటలకు రత్నాలంకారం, బంగారు చీర అలంకరణ, ప్రత్యేక దర్శనం, 6 గంటలకు గంగమ్మకు ముత్యాల చీర అలంకరణ, ప్రత్యేక దర్శనం,రాత్రి 7 గంటలకు నాదస్వర కచ్చేరి, 8 గంటలకు గ్రామ దేవతలకు పూజలు, అనుజ్ఞ, 9 గంటలకు పోలేరమ్మ గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

పోలేరమ్మ ఉత్సవంలో విద్యుద్దీప, పుష్పాలంకరణలతో పాటు సినీ, టీవీ కళాకారులతో ప్రదర్శించే సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.

పోలేరమ్మ దయతోనే..



పోలేరమ్మ దయతోనే అందరం సుఖశాంతులతో ఉన్నాం. పోలేరమ్మ గ్రామోత్సవంలో పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకుంటే సకలశుభాలు కలుగుతాయి. ప్రతిఒక్కరూ జాతరలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందుకోవాలి.

– కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

విద్యుత్ చార్జీల బాదుడుపై పోరుబాట రేపు



పోస్టర్లను ఆవిష్కరించిన వైఎస్సార్‌సీపీ నాయకులు

కావలి: కూటమి ప్రభుత్వ విద్యుత్ చార్జీల బాదుడును నిరసిస్తూ ఈ నెల 27న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి నేతృత్వంలో ఉదయం 10 గంటలకు ఉదయగిరి బ్రిడ్జి సెంటర్‌లో నిర్వహించే కార్యక్రమంలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విద్యుత్ చార్జిల బాదుడుపై వైఎస్సార్‌సీపీ పోరుబాట కార్యక్రమ పోస్టర్లను బుధవారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు పందిటి కామరాజు, వాణిజ్య విభాగం జిల్లా మాజీ అధ్యక్షుడు కనమర్లపూడి వెంకటనారాయణ మాట్లాడారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఎలాగైనా అధికారంలోకి రావాలనే కాంక్షతో బూటకపు హామీలను గుప్పించారన్నారు. అధికారంలోకి రాగానే వాటిని తుంగలో తొక్కి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. విద్యుత్ చార్జీలను పెంచబోమని, అవసరమైతే తగ్గిస్తామంటూ ఊదరగొట్టిన చంద్రబాబు అధికారంలోకి రాగానే విద్యుత్ చార్జీల బాదుడు మొదలు పెట్టారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోనే విద్యుత్ చార్జీల రూపంలో రూ.15వేల కోట్ల భారాన్ని రాష్ట్ర ప్రజలపై మోపారన్నారు. విద్యుత్ చార్జీల భారాన్ని ఉపసంహరించుకునేలా కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు గంధం ప్రసన్నాంజనేయులు, మండలి కృష్ణారావు, పేరం వెంకటేశ్వర్లు, చెన్ను ప్రసాద్‌రెడ్డి, షేక్ నాయబ్‌రసూల్, పూనూరు మురళిరెడ్డి, లక్షణ్, వాయిల తిరుపతి, ఆత్మకూరు రాజేష్, సురేష్, అమరా శ్రీనివాసులు, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాజ్‌పేయికి నివాళి



కావలి: వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

కావలి: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో మాజీ ప్రధాని వాజ్‌పేయి శతజయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు కుట్టుబోయిన బ్రహ్మానందం ఆధ్వర్యంలో వాజ్‌పేయి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను స్మరించుకున్నారు. నాయకులు గుండ్లపల్లి భరత్‌కుమార్, అంచిపాక కమల, సీవీవీ సత్యం, పరుసు వెంకటేశ్వర్లు, వింత రంగారెడ్డి, పూనూరు మాధవి, పాతపాటి రమణారెడ్డి, అమరా వెంకట సుబ్బారావు, మంద కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి: స్థానిక బీజేపీ కార్యాలయంలో వాజ్‌పేయి చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాజ్‌పేయి ప్రధానిగా దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. నాయకులు ఆవుల రోశయ్య, చల్లా సుబ్బరత్నం, దుర్గయ్య, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



ఉదయగిరిలో..

దుత్తలూరు: బీజేపీ మండలాధ్యక్షుడు చుండి హరిగోపాల్‌రెడ్డి అధ్యక్షతన దుత్తలూరు, నర్రవాడ, లక్ష్మీపురం గ్రామాల్లో వాజ్‌పేయి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాజ్‌పేయి ప్రధానికి దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. కిసాన్‌మోర్చా జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు మేకపాటి మాల్యాద్రినాయుడు, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి లెక్కల వెంకటరెడ్డి, మండల ధర్మజాగరణ ప్రముఖ్ పెసల కృష్ణ పాల్గొన్నారు.



దుత్తలూరులో..